క్లుప్తంగా

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



రామకృష్ణ మృతదేహంపై పూలమాల వేస్తున్న ఎంఈవో రాంబాబు, ఉపాధ్యాయులు

కొయ్యూరు: బూదరాళ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గోకిరి రామకృష్ణ(50) సోమవారం రాత్రి విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొద్ది కాలంగా రామకృష్ణ అనారోగ్యంతో ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఎంఈవో ఎల్.రాంబాబు, సర్పంచ్ పీటా సింహాచలం, వైస్ ఎంపీపీ అంబటి నూకాలు తదితరులు రామకృష్ణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంచి ఉపాధ్యాయుడిని కోల్పోయామన్నారు. మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు సురేష్, అచ్చిబాబు తదితరులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యురాలిగా స్నేహలత నియామకం

కొయ్యూరు: రాజేంద్రపాలెం ఆస్పత్రికి రెగ్యులర్ ప్రతిపాదికన వైద్యురాలిని నియమించారు. అన్నమయ్య జిల్లా సంధ్యాలకు చెందిన స్నేహలతను ఇక్కడి వైద్యురాలిగా నియమించారు. ఆ మేరకు ఆమె మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కొద్దిసేపు రోగులను పరీక్షించారు. మరో వైద్యులు నాయక్ కూడా రాజేంద్రపాలెం ఆస్పత్రికి నియమించారు. ఆయన ఇంకా బాధ్యతలు స్వీకరించలేదు. ఇక్కడ రెగ్యులర్ వైద్యులు సంపత్‌బాబుకు బదిలీ అవడంతో ఖాళీ ఏర్పడింది.

డ్రైనేజీ పనులు ప్రారంభం



కుడ్డంగిలో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ హనుమంతరావు

జి.మాడుగుల: మండలంలో సొలభం పంచాయతీ కుడ్డంగి గ్రామంలో మంగళవారం డ్రైనేజీ నిర్మాణ పనులను సర్పంచ్ ఐసరం హనుమంతరావు ప్రారంభించారు. డ్రైనేజీ నిర్మాణంతో ప్రజల ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారమవుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీటీసీ బాలయ్య దొర, వార్డు సభ్యులు సత్యనారాయణ, కళ్యాణి, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు అప్పలరాజు, నాయకులు అప్పలనాయుడు, కేశన్నదొర, నీలకంఠంనాయుడు, మత్స్యరాజు తదితరలు పాల్గొన్నారు.

చింతపల్లి ఎంపీడీవోగా హనుమంతరావు నియామకం



చింతపల్లి: చింతపల్లి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా ఎన్.హనుమంతరావు నియమితులయ్యారు.గత కొంతకాలంగా ఇక్కడ ఎంపీడీవో పోస్టు ఖాళీగా ఉంది. గడిచిన రెండు నెలలుగా డిప్యూటీ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పూర్తి అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. జిల్లా పరిషత్ అధికారులు పూర్తిస్థాయి ఎంపీడీవోగా ఎన్.హనుమంతరావును నియమించారు. ఆయన భీమిలి నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

నాణ్యమైన విద్యను అందించాలి



పాఠాలు బోధిస్తున్న ఎంఈవో-2 గెన్ను

డుంబ్రిగుడ: ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే చిన్నారుల ప్రగతికి నాణ్యమైన విద్యను అందిస్తే భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని ఎంఈవో 2 జి గెన్ను అన్నారు. మండలంలోని కించుమండ, చంపాగుడ, కొర్రా ప్రాథమిక పాఠశాలల్లో మంగళవారం తనిఖీ నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో చిన్నారుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. చిన్నారులకు పాఠాలు బోధించారు. రికార్డులను తనిఖీ చేసి మధ్యాహ్న భోజన మెనును పరిశీలించారు. పాఠశాలల్లో విద్యస్థాయి, భోజన పథకం అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారంతో పాటు విద్యా ప్రమాణాలను మెరుగుపరిచాలని ఆయన సూచించారు.

స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ

కొయ్యూరు/ఎటపాక: కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ కేంద్రం, ఎటపాక మండలంలోని నెల్లిపాకలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. బూదరాళ్లలో సర్పంచ్ ముత్యాలమ్మ, వీఆర్వో గంగాధర్ తదితరులు, ఎటపాకలో తహసీల్దార్ కారం సుబ్బారావు, సర్పంచ్ భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.





బంగారుమెట్ట గ్రామ సమీపంలో చిత్తడి రహదారి

గోతులమయం

• అధ్వాన దారులతో సతమతం • నిత్యం వాహనచోదకుల అవస్థలు • పట్టించుకోని అధికారులు

పెదబయలు: పాడేరు నుంచి పెదబయలు మండలం వరకు సుమారు 35 కిలోమీటర్ల రోడ్డు గోతులమయంగా మారింది. మండలంలోని గలగండ పంచాయతీ మంగబంద నుంచి చుట్టుమెట్ట వరకు అరడకోట నుంచి బంగారుమెట్ట వరకు పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తోంది. అలాగే బంగారుమెట్ట నుంచి సీతగుంట పంచాయతీ చిత్రాయిపుట్టు వరకు రోడ్డు విస్తరణ పనులు చేయక రహదారి అంచులు కోతకు గురికావడం, రోడ్డు బంగారుమెట్ట పన్నెడ గ్రామాల మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల ఇదే ప్రదేశంలో తరుచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో వాహనాలు జాగ్రత్తగా వెళ్లకపోతే ప్రమాదాల బారిన పడక తప్పదన వాహనచోదకులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో సుమారు నాలుగు కిలో మీటర్ల ప్రయాణం ఇబ్బందిగా ఉందంటున్నారు. గోతుల




మంగబంధ గ్రామ సమీపంలో దెబ్బతిన్న రోడ్డు

రోడ్డుతో పాటుగా ఎదురుగా వాహనాలు వస్తే తప్పించే క్రమంలో రోడ్డు అంచుదిగడం ఇబ్బందిగా ఉంటుందని చెబుతున్నారు. భారీ లోడుతో వస్తున్న వాహనాలు పక్కక వెళ్లే పరిస్థితి లేదని అంచుదిగితే బోల్తా పడే అవకాశం ఉందని జాగ్రత్తలు తీసుకుంటే ప్రతీ రోజు భారీ వాహనాలు వస్తే ట్రాఫిక్‌తో సమస్య ఏర్పడుతోంది.

రోడ్డు విస్తరణ జరిగేదెన్నడో?

పాడేరు నుంచి జోలాపుట్టు, డుడుమ వరకు రోడ్డు విస్తరణ పనులు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో చేపట్టారు. అయితే సీకరి పంచాయతీ బంగారుమెట్ట నుంచి సీతగుంట పంచాయతీ సంపంగిపుట్టు వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. నాలుగు కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కావడం లేదు. సమస్యపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని పెదబయలు. ముంచంగిపుట్టు మండలాల ప్రజలు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి అత్యవసరంగా నాలుగు కిలో మీటర్ల రోడ్డు విస్తరణ పనులు చేపట్టా లని వారు కోరుతున్నారు.

రోడ్డు వెడల్పు చేయాలి



పెదబయలు మండలం పరిధిలో నాలుగు కిలోమీటర్ల రోడ్డు విస్తరణ చేయాల్సి ఉంది. ఇరుకైన రహదారి వలన తరచూ భారీ లారీలు, బస్సులు, ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. వాహనదారులు రోడ్డు అంచుదిగితే తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు అంచుకు గుంతులు పూడ్చాలని, అలాగే రోడ్డుకు ఏర్పడిన గుంతులు పూడ్చాలని, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి. సర్వసభ్య సమావేశంలో అధికారులకు తెలియజేశాం. ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– చెండా రవిశంకర్, సర్పంచ్, పర్రెడ గ్రామ పంచాయతీ,పెదబయలు మండలం.

కలెక్టర్‌కు నివేదించాం

నాలుగు కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు సంబంధించి అంచనా వేసి కలెక్టర్ దినేష్‌కుమార్‌కు నివేదించాం.. ఇటీవల వర్షాలకు మరింగా గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల గురించి కూడా తెలియజేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రహదారి మరమ్మతు పనులు చేపడతామం.రోడ్డు విస్తరణకు సంబంధించి నిధులు మంజూరైతే పనులు చేపడతాం.

– శ్రీదేవి, ఏఈ, ఆర్అండ్‌బీ శాఖ, పెదబయలు మండలం

గ్రామసభల అనుమతి కోసం వినతి



పెదబయలు ఎస్ఐ రమణకు వినతి అందిస్తున్న గోమంగి మండల సాధన సమితి నాయకులు

పెదబయలు: మండలంలోని గోమంగి ప్రత్యేక మండలం సాధనే లక్ష్యంగా గోమంగి మండల సాధన సమితి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు 17 గ్రామ పంచాయతీల పరిధిలో గ్రామ సభలు నిర్వహించేందుకు అనుమతులు కోసం స్థానిక ఎస్ఐ కొల్లి రమణను మంగళవారం కోరారు. గోమంగి మండల సాధన సమితి నాయకులు మాట్లాడుతూ పెదబయలు మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు కేంద్ర బిందువుగా గోమంగి ఉందని, ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, సాధన సమితి నాయకులు పృథ్వీరాజ్, అనంత పద్మనాభం, సింహాచలం, ధనలక్ష్మీ, నవీన, బాలరాజు, మేఘరాజు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు



బస్సులో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ రవీంద్ర, బృందం

సీలేరు: ఒడిశా నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల నుంచి అంతర్రాష్ట్రాలకు ఎవరైనా అక్రమార్కులు గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కేసులు నమోదు చేస్తామని సీలేరు ఎస్ఐ రవీంద్ర హెచ్చరించారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అంతరాష్ట్ర బస్సు సర్వీసుల్లో నిరంతరం తనిఖీలు చేపడుతున్నామన్నారు. గంజాయి నిర్మూలనకు పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందనానరు. పూర్తిస్థాయిలో రవాణాకు అడ్డుకట్ట వేస్తోందన్నారు. గంజాయి సాగు, రవాణా చట్ట రీత్యా నేరమని, గ్రామస్తులు వాటికి దూరంగా ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా సంచరిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

చింతపల్లి: మండలంలో రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను కూటమి ప్రభుత్వం పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పొంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. తాజంగి పంచాయతీ కేంద్రంలో రైతులకు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంటకు సరిపడిన విత్తనాలను పంపిణీ చేయకుండా కూటమి ప్రభుత్వం కంటితుడుపు కింద కేవలం 5 కేజీలు విత్తనాలను పంపిణీ చేయడం దారుణమన్నారు. ఆ పంపిణీ చేసిన విత్తనాలు సైతం మొలకెత్తనవి, పాడైనవి సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వాన్ని నమ్మిన ప్రజలకు నిలువునా మోసం చేస్తూ ఇబ్బందులు గురిచేస్తుందని ఆరోపించారు. రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సకాలంలో పూర్తిగా పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు ప్రభాకర్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

బెర్రీ బోరర్ తెగుళ్లపై అవగాహన అవసరం



బంగారుమెట్టలో కాఫీ తోటలను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కుమార్



గొందిపాకలలో కాఫీ తోటలను పరిశీలిస్తున్న అధికారుల బృందం



దామనాపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



చట్లవాడలో కాఫీ తోటలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విశ్వనాథ్,హెచ్ఓ ముత్తయ్య తదితరులు

ముంచంగిపుట్టు: కాఫీ పంటకు వచ్చే బెర్రీ బోరర్ తెగుళ్ల నివారణకు గిరిజన కాఫీ రైతులు, అన్ని శాఖల ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని డీఎల్‌పీవో (డివిజనల్ డెవలప్మెంట్ అధికారి) మండల ప్రత్యేక అధికారి పి.ఎస్.కుమార్ అన్నారు. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ కేంద్రంలో కాఫీ తోటలను ఆయన మంగళవారం పరిశీలించారు.కాఫీ రైతులతో మాట్లాడి పంటకు సోకుతున్న బెర్రీ బోరర్ తెగుళ్లపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో కాఫీ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎల్‌పీవో పిఎస్. కుమార్ మాట్లాడుతూ బెర్రీ బోరర్ తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని, కాఫీ పంటను కోసే సమయంలో టార్పాలిన్ షీట్స్‌ను పరిచి కోయాలని, నవంబర్, డిసెంబర్ నెలల్లో పంటను కోయలని, నేలరాలే కాఫీ కాయలను తగ్గించడం వల్ల కీటకాలను నాశనం చేయవచ్చన్నారు. బవేరియా బాసియాన పిచికారీ చేయాలని, అధిక ఉష్ణోగ్రతలు లేకుండా గాలిలో తేమశాతం ఉండేలా చూసుకోవాలని, వర్షం పడే సమయంలో పిచికారీ చేయవద్దని సూచించారు. కాఫీ కాయ కొన భాగంలో పురుగు గుండ్రటి సూక్ష్మ రంధ్రం చేస్తుందని, పిండి లాంటి పదార్థాన్ని రంధ్రం నుంచి బయటకు పంపిస్తుందని ఇలాంటి లక్షణాలు ఉంటే వెంటనే రైతులు అప్రమత్తమే అధికారులకు సంప్రదించాలన్నారు. తెగుళ్లతో కాఫీ పంటకు నష్టం వస్తే కిలో రూ.50 చొప్పున్న ఆర్థిక సాయమందిస్తామని ఆయన రైతులకు సూచించారు. ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి, తహసీల్దార్ శంకర్‌రావు, ఏవో మురళీకృష్ణ, హెచ్‌వో శరణ్యమాధురి, ఈవోపీఆర్‌డీవో చిన్నాన్న, పంచాయతీకార్యదర్శులు ఎస్‌కె ఫాతీమా, సింహాచలం, వైఎస్సార్‌సీపీ నాయకుడు జగన్నాథం, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చింతపల్లి: కాఫీపంటకు బెర్రి బోరర్ తెగుళ్ల పట్ల కాఫీ రైతులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. గొందిపాకలు గ్రామంలో కాఫీ తోటలను మంగళవారం మండల అధికారులు బృందంతో కలిసి పరిశీలించారు. అనంతరం గ్రామ సచివాలయంలో రైతులతో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కాఫీ పంటను ఆశించిన బెర్రి బోరర్ తెగులు నాశనానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందన్నారు. ఈ తెగులు సోకిన పంటలను గుర్తించడానికి ప్రత్యేకంగా అధికారులు బృందాలతో సర్వే కార్యక్రమాన్ని చేపడుతుందన్నారు. తహసీల్దారు ఆనంద్‌కుమార్, ఏవో మధుసూదన్‌రావు, ఏపీఎం శ్రీనివాసురావు, ఏపీవో చాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అబ్బాయి నాయుడు, సర్పంచ్ వరలక్ష్మి, ఎంపీటీసి మోహన్‌రావు, వ్యవసాయ, ఉద్యానశాఖ అసిస్టెంట్‌లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గూడెం కొత్తవీధి (చింతపల్లి): రైతులు కాఫీ తోటల్లో ఆశించే కాయతొలచు పురుగు పట్ల జాగ్రత్తలు పాటించాలని అధికారుల బృందం సూచించారు. మండలంలో దామనాపల్లిలో కాఫీ తోటలను అధికారుల బృందం మంగళవారం పరిశీలించారు. కాఫీ రైతులకు బెర్రి బోరర్ తెగుళ్ల నష్టాలను వివరించారు. తెగులు సోకితే తీసుకోవలసిన జాగ్రత్తలను తెలిపారు. ఎంపీడీఓ ఇమ్మానుయేల్, తహసీల్దార్ అన్నాజీరావు, హెచ్ఓ అరుణకుమారి, వ్యవసాయ, ఉద్యానవన క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం: మారేడుమిల్లిలో కాఫీ తోటలను రక్షించి రైతులకు అధికారులు అండగా ఉంటుందని ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ అన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారుల బృందంతో ఆయన మండలంలోని చట్లవాడలో కాఫీ తోటలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విశ్వనాథ్ మాట్లాడుతూ కాఫీ తోటలకు బెర్రీ బోరెర్ తెగుల్లు సోకినట్టు సమాచారం అందడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు పంటకు నష్టం రాకుండా తీసుకోవాల్సిన అంశాలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పంచాయతీ పరిధిలో 78 హెక్టార్లలో కాఫీ తోటలను పరిశీలించామని, ఈ పరిధిలో ఎక్కడ కాఫీ బెర్రీ బోరర్ తెగుళ్ల లేవని, నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. హెచ్ఓ ముత్తయ్య, ఏఓ వెంకటేశ్వర్లు, రవి తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి



ఏపీఎం ఈశ్వర్‌బాబుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సీఐటీయూ నేత మహేష్, వీవోఏలు

జి.మాడుగుల: వీవోఏలకు బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని లేకుంటే ఈ నెల 11 నుంచి ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామని సీఐటీయూ మండల కో-కన్వీనర్ వి.మహేష్, వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యలింగం హెచ్చరించారు. జి.మాడుగుల వెలుగు కార్యాలయంలో ఏపీఎం ఈశ్వర్‌బాబు నాయుడుకు మంగళవారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ వెలుగు వీవోఏ సమస్యలు పరిష్కరించాలని, బకాయిపడ్డ వేతానలు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. వెలుగు వీవోఏలకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవటం వలన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతేడాది ఫిబ్రవరి నెల నుంచి గౌరవ వేతనాలు మంజూరు కాలేదని తక్షణమే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. వీవోఏలకు పనిభారం తగ్గించాలని, స్త్రీనిధి ఇన్‌సెంటివ్ విడుదల చేయాలని వారు కోరారు. వీవోఏలు దేవినాయుడు, నాయకులు లక్ష్మణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు జాగ్రత్తలు పాటించాలి



దోమల నివారణ మందు పిచికారీ పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి

ముంచంగిపుట్టు: దోమల నివారణకు తగు జాగ్రత్త లు తీసుకోవాలని ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి అన్నారు. మండల కేంద్రంలో పలు వీధుల్లో మంగళవారం దోమల నివారణ మందు పిచికారీని చేశారు. ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి ఉండడంతో దోమలు పెరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. దోమలు కుట్టడం వలన మలేరియా, డెంగ్యూ, చికున్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వ్యాధులు ప్రబలకుండా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల రహిత సమాజం ఆరోగ్యానికి సోపానమని, ప్రజలు దోమల నివారణ కోసం కృషి చేయాలన్నారు. మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి పురుషోత్తం, పంచాయతీ కార్యదర్శి సింహాచలం, హెల్త్ అసిస్టెంట్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి ప్రసవాలతో తల్లి, బిడ్డ ఆరోగ్యం సురక్షితం



ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి వాసవి

చింతపల్లి: ఆసుపత్రిలో ప్రసవం పొందడం ద్వారా తల్లి బిడ్డలు ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని స్త్రీ వైద్య నిపుణులు ఎస్.వాసవి అన్నారు. ఏరియా ఆస్పత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 94 మంది గర్భిణులకు మంగళవారం పరిక్షలు చేసి అల్ట్రాసౌండ్ స్కానింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేసుకోవడంతో ప్రసవానికి ముందు బిడ్డ ఆరోగ్య పరిస్థితిని గుర్తించవచ్చునన్నారు. క్రమం తప్పకుండా గర్భిణులు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని, మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. వైద్యాధికారులు సూచించిన ప్రసవ సమయానికి పదిరోజులు ముందుగానే గర్భిణులు వసతి గృహంలో చేర్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు.వసతి గృహంలో గర్భిణులతోతో పాటు సహాయకునికి కూడా భోజన, వసతి అన్ని సౌకార్యాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రొటోకాల్ పాటించాలి



సర్పంచ్, ఉప సర్పంచ్‌ను ఆహ్వానించకుండా కుమ్మరివీధిలో కూటమి నేతలతో స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది

పెదబయలు: రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా కూటమి నేతలతోనే ప్రభుత్వ కార్యక్రమాలు చేస్తున్నారని, ప్రొటోకాల్ పాటించడం లేదని గోమంగి పంచాయతీ సర్పంచ్ కొర్ర జెట్టో, ఉప సర్పంచ్ కూడ మత్స్యకొండబాబు మంగళవారం తెలిపారు. వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల పంచాయతీల్లోని గ్రామాల్లో స్మార్ట్‌కార్డులు, రాజ్‌మా విత్తనాల పంపిణీ కార్యక్రమాలకు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధిత అధికారులు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా కూటమి నేతలతో పంపిణీ చేశారన్నారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులను గౌరవించాలన్నారు. తమ పదవులకు అధికారులు అగౌరపరస్తున్నా సచివాలయం, వ్యవసాయ సిబ్బందిపై తగిన ఆధారాలతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు, ఎంపీటీసీ తదితరులు

రంపచోడవరం: మండలంలోని ముసురుమిల్లి పంచాయతీ పరిధిలోని ముసురుమిల్లి, బోర్నగూడెం గ్రామాల్లో సర్పంచ్ కోసు రమేష్‌బాబు అధ్యక్షతన ఆదికర్మ యోగి అభియాన్ కార్యక్రమం జరిగింది. సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు కుంజ వంశీ మాట్లాడుతూ ముసురుమిల్లిలో ఒక్క అభివృద్ధి జరగలేదన్నారు. గ్రామంలో ఇళ్లు వర్షానికి కారిపోతున్నాయని తెలిపారు. కొత్త ఇళ్లు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాలకు, అంగన్‌వాడీకి ప్రహరీ నిర్మించాలన్నారు.మహిళలకు, యువతకు ఆర్థికాభివృద్ధి కోసం జీడిపిక్కల యూనిట్, పేపర్ ప్లేట్స్ తయారీ యూనిట్ గాని ఏర్పాటు చేయాలాన్నరు. ముసురుమిల్లి నుంచి ఈతలపాడు వరకు రోడ్డు మంజూరు చేస్తే దేవీపట్నం మండలంలోని గ్రామస్తులు మండల కేంద్రానికి వెళ్లేందుకు అనువుగా ఉంటుందన్నారు. గ్రామంలో తాగునీరు, రహదారులు సమస్యలు ఉన్నాయన్నారు. ఆదికర్మయోగి అభియాన్ ద్వారా అభివృద్ధి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో రాజు, ఉప సర్పంచ్ ప్రభారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొబ్బా శేఖర్, సరస్వతి, బాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం



పెదబయలులో కురుస్తున్న వర్షం

పెదబయలు: మండలంలో మంగళవారం మధ్యాహ్నం కుండపోత భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు వీధుల్లో వర్షం నీరు చేరింది. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం సమీపంలో డ్రైనేజీ మూసుకుపోవడంతో వర్షపునీరు సమీప ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. మోకాళ్లోతు వర్షపునీటిలోనే రాకపోకలు సాగించారు. అధికారులు డ్రైనేజీల్లో పూడుకుపోయిన చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పీసా కమిటీ ఉపాధ్యక్షుడి తీరుపై ఫిర్యాదు



తహసీల్దార్ రాజ్‌కుమార్ ఫిర్యాదు చేస్తున్న నాయకులు

జి.మాడుగుల: సొలభం పంచాయతీ వంజంగిపాడు(క్లస్టర్) పీసా కమిటీ ఉపాధ్యక్షుడు లకే రామకృష్ణ తీరుపై పీసా మండల కమిటీ అధ్యక్షుడు ఐసరం హనుమంతరావు, ఉపాధ్యక్షుడు పలాసి కృష్ణామూర్తి, గౌరవ అధ్యక్షుడు తల్లే సూరిబాబు తదితరులు తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో డేవిడ్‌రాజ్‌కు వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీసా కమిటీ అధ్యక్షునిగా చెప్పుకుంటూ రామకృష్ణ స్థానిక విద్యాలయాలు, గిరిజనేతరుల నుంచి అనధికార వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. గతంలో వీఆర్వోగా పనిచేసినపుడు అతడిపై కేసు నమోదై ఉన్నట్టు చెప్పారు. రామకృష్ణపై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు సర్పంచ్ రాంబాబు, సర్పంచ్‌లు రవని, గంగరాజు, బాలన్న, సూరిబాబు, రాజులమ్మ, మాలన్న, పద్మ, చిలకమ్మ, అప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.